క్లుప్తంగా

వాటర్ ట్యాంకర్ బోల్తా



ప్రమాదానికి గురైన వాటర్ ట్యాంకర్

డుంబ్రిగుడ: మండలంలోని సొవ్వ గ్రామంలో రోడ్డు పనులకు వాటరింగ్ చేస్తుండగా గురువారం ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా పడింది.ఈ సంఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు



భక్తులతో కలిసి పూజలు చేస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి, సర్పంచ్ తదితరులు

అనంతగిరి: మండలంలోని గుమ్మ పంచాయతీ కేంద్రంలోని టీటీడీ సహకారంతో నిర్మించిన రామాలయం ప్రారంభోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ శెట్టి నీలవేణి మాట్లాడుతూ టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి నేతృత్వంలో ఏజెన్సీలోని గ్రామాల్లో ఆలయాలు నిర్మాణాలు జరుగుతుండడం సంతోషంగా ఉందన్నారు. గిరి గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంటుందన్నారు. సర్పంచ్ ముత్యాలమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ బోయినకుమారి తదితరులు

గూడెంకొత్తవీధి: రైతులకు అండగా ప్రభుత్వం నిలుస్తోందని, పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎంపీపీ బోయిన కుమారి చెప్పారు. మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో గురువారం రైతులకు రాయితీపై వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విత్తన కిట్‌లు పంపిణీ



విత్తన కిట్లను తయారుచేస్తున్న ప్రకృతి వ్యవసాయం క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, రైతులు

రాజవొమ్మంగి: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా మండలంలోని వాతంగి రైతులకు ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు నిర్వాహకులు గురువారం 30 రకాల పీఎండీఎస్ విత్తన కిట్లను అందజేశారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. జనుము, జీలుగు, జొన్న, మొక్కజొన్న, నువ్వులు, ఆముదం, మినుములు, పెసర, తోటకూర, గోంగూర తదితర 30 రకాల విత్తనాలను కలిపిన 350 కిట్లు రైతులకు అందించినట్టు స్థానిక ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు సీఆర్పీ కె.అప్పలరాజు తెలిపారు. ఈ విత్తనాలను తొలకరికి ముందే దుక్కి దున్నిన పొలాల్లో వెదజల్లుకోవాలని రైతులకు సూచించామన్నారు. ఐసీఆర్పీలు సత్యనారాయణ, పాపారావు గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

మండలానికి 84 మంది టీచర్లు

పెదబయలు: ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా మండలంలో వేర్వేరు ప్రాంతాల నుంచి 84 మంది ఎస్‌జీటీలు చేరినట్టు ఎంఈవో కొరవంగి సింహాచలం తెలిపారు. పెదబయలు మండలంలో పనిచేస్తున్న 94 మంది ఉపాధ్యాయులు బదిలీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్టు పేర్కొన్నారు. ఈ మేరకు మండలం నుంచి 28 మంది ఇతర మండలాలకు బదిలీ అయ్యారని తెలిపారు. కొంతమంది ఇదే మండలంలో బదిలీ అయ్యారని, అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు జాయిన్ అయ్యారని తెలిపారు. ఈ సారి మైదాన ప్రాంతాల నుంచి ఉపాధ్యాయులు ఎక్కువ మంది వచ్చినట్టు తెలిపారు.

చకచకా పనులు

- తీరిన డ్రైనేజీ సమస్యలు
- గిరిజన గ్రామాల్లో జోరుగా పనులు
- ఒక్కో డ్రైనేజీకి రూ.2లక్షల కేటాయింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న గిరిజనులు

ముంచంగిపుట్టు: ఏళ్ల తరబడి సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక జోలాపుట్టు పంచాయతీలో చాలా గ్రామాల్లో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దశాబ్దాల క్రితం నిర్మించిన శిథిలమైన డ్రైనేజీలు, పూడిక పేరుకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా మురుగునీరు రోడ్లపై పారుతుండడంతో నానా అవస్థలు పడేవారు. బురదనీరు, తీవ్ర దుర్గంధంతో ముక్కు మూసుకొని వెళ్లాల్సిన దుస్థితి ఉండేది. సమస్య పరిష్కరించాలని గత టీడీపీ హయాంలో పాలకులకు గ్రామస్తులు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. సమస్యతోనే ఏళ్ల తరబడి సావాసం చేశారు.అదంతా గతం.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మన్యంలో అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా శివారు గ్రామాల్లో రహదారులు, తాగునీటి సదుపాయంతో పాటు డ్రైనేజీలు తదితర పనులకు కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తోంది. దీంతో గిరిజన గ్రామాలు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయి.

ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం

మండలంలోని జోలాపుట్టు పంచాయతీలోని బోంద్రుగూడ, లబ్బూరు, కులబీరు, జప్పారు గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక స్థానికులు ఇబ్బందులు పడుతూ ఉండేవారు. గత టీడీపీ ప్రభుత్వం కాలంలో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని, నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ కార్యలయాల చుట్టూ ఆయా గ్రామాల గిరిజనులు తిరిగి తిరిగి మంజూరు కాక విసుగు చెందారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ గ్రామస్తులకు ఎంతగానో ఉపయోగపడింది. ఆయా గ్రామ గిరిజనులు డ్రైనేజీ సమస్యను గ్రామ సచివాలయం ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన అధికారులు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో కులబీరు, బొంద్రుగూడ, జప్పారు.లబ్బూరు గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా ఒక్కొక్క డ్రైనేజీ నిర్మాణానికి రూ.2లక్షల చొప్పున ప్రభుత్వం కేటాయించి. దీంతో గత రెండు నెలలు నుంచి ప్రారంభమైన డ్రైనేజీ పనులను వేగంగా పూర్తి చేశారు. దీనికి తోడు మండలంలో గల సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టు గ్రామంలో సైతం జెడ్పీ నిధులు రూ.8.40లక్షలతో శరవేగంగా డ్రైనేజీ పనులు జరుగుతున్నాయి. ఏళ్ల నాటి సమస్య పరిష్కారం కావడంతో ఆయా గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



జప్పారులో నిర్మించిన డ్రైనేజీ

పూర్తయిన పనులు

డ్రైనేజీ సమస్యను గిరిజనులు తెలియజేయడంతో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. దీంతో జోలాపుట్టు పంచాయతీలో డ్రైనేజీల నిర్మాణానికి రూ.8లక్షలు మంజూరయ్యాయి.వీటితో పాటు సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టులో డ్రైనేజీ నిర్మాణానికి రూ.8.40లక్షలు మంజూరయ్యాయి. దీంతో వేగంగా నిర్మాణాలు మొదలు పెట్టి పూర్తి చేశాం .కుమ్మరిపుట్టు డ్రైనేజీ సైతం దాదాపు పూర్తయింది.

– సాయికృష్ణ, ఏఈఈ (ఆర్‌డబ్ల్యూఎస్), ముంచంగిపుట్టు మండలం

సంతోషంగా ఉంది

డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక గ్రామంలోకి వచ్చే రహదారిలో మురుగు కాల్వ నీరు రోడ్డు మీదకు వచ్చి దుర్వాసన వెదజల్లేది. డ్రైనేజీ సమస్యను గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా డ్రైనేజీ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. వెంటనే రూ.2లక్షలు మంజూరు చేసి డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేశారు. దీంతో ఏళ్ల నాటి సమస్య కొద్ది రోజుల్లోనే పరిష్కారమైంది. చాలా సంతోషంగా ఉంది.

–వి.పరుశురాం, కులబీరు గ్రామం, జోలాపుట్టు పంచాయతీ, ముంచంగిపుట్టు మండలం

ఆశ్రమ పాఠశాలల్లో ఫాగింగ్ పనులు

అడ్డతీగల: జ్వరాల వ్యాప్తిని నిరోధించడానికి ముందస్తు జాగ్రత్త చర్యగా మలేరియా విభాగం అధికారులు ఆశ్రమ పాఠశాలల్లో విస్తృతంగా దోమల మందు పిచికారీ చేస్తున్నారు. అడ్డతీగల మలేరియా విభాగం సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ ఆధ్వర్యంలో మూడు బృందాలు ఇతర సిబ్బందితో కలిసి రెండు రోజులుగా ఆశ్రమ పాఠశాలల్లోని గదుల్లో దోమల నివారణ మందు పిచికారీ పనులు చేస్తున్నారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ పనులు నిర్వహిస్తున్నామని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ చెప్పారు. మండలంలోని 13 ఆశ్రమ పాఠశాలలు(వసతి గృహాలు), ఉండగా ఈనెల 17వ తేదీ నాటికి అన్నింట్లో దోమల నివారణ మందు పిచికారీ పనులు పూర్తిచేస్తామన్నారు. విద్యార్థులకు దోమల బెడద లేకుండా ఉండేలా ఒంటిపూట బడులు జరుగుతున్న నేపథ్యంలో మధ్యాహ్న సమయంలో మందుని పిచికారీ చేయించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.



బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల గదుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

సీసీఆర్‌సీ కార్డులపై అవగాహన



సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్ శ్రీమన్నారాయణ

గంగవరం: మండలంలో అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో వీఆర్వోలు, వీఏఏలు సంయుక్తగా గుర్తించిన కౌలు రైతులకు సీసీఆర్‌సీ (పంట సాగుదారు హక్కు పత్రాలు) కార్డులను పంపిణీ చేయాలని తహసీల్దార్ శ్రీమన్నారాయణ సూచించారు. మండల వ్యవసాయాధికారి కె.విశ్వనాథ్‌తో కలిసి రెవెన్యూ, వ్యవసాయ శాఖ వీఏఏలతో ఆయన సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించారు. సీసీఆర్‌సీ కార్డుల ప్రయోజనంపై కౌలు రైతులకు సిబ్బంది అవగాహన కల్పించారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ప్రతి గిరిజన రైతు సీసీఆర్‌సీ కార్డుకు అర్హుడన్నారు. భూ యజమాని హక్కులకు, ప్రభుత్వ పథకాలకు ఏ విధమైన ఇబ్బంది ఉండదనే అంశాన్ని రైతులకు వివరించాలన్నారు. ఏవో విశ్వనాథ్ మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ వరకు సీసీఆర్‌సీ కార్డుల నమోదుకు గడువు ఉందన్నారు. గ్రామాల్లో రైతులకు కౌలు కార్డు గురించి అవగాహన కల్పించాలన్నారు. ఈ మేరకు రైతులు రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించాలన్నారు. సచివాలయాల వీఆర్వోలు, వీఏఏలు పాల్గొన్నారు.

ఆత్మీయ వీడ్కోలు



బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓ బాపన్నదొరను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, సిబ్బంది

జి.మాడుగుల: మండలంలో వంజరి పంచాయతీ పద్మాపురం పాఠశాల ఉపాధ్యాయుడు రామచంద్రుడు బదిలీ వెళ్తున్న సందర్భంగా గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. గెమ్మెలి పంచాయతీ జి.పెదబయలు గ్రామంలోని పాఠశాలకు ఆయన బదిలీపై వెళ్తుండడంతో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఉపాధ్యాయులు జయరావు, మహేష్‌బాబు, పీఎంసీ సభ్యుడు రామ్మూర్తినాయుడు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడు రామచంద్రుడును సన్మానిస్తున్న గ్రామస్తులు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి నుంచి అడ్డతీగలకు బదిలీ అయిన ఎంపీడీఓ బాపన్నదొరను స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జెట్పీటీసీ సభ్యురాలు ఒడుగులు జ్యోతి, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజు, పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, వెలుగు ఏపీఎం ఆదినారాయణరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ధర్నా

గంగవరం : అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి అంగన్‌వాడీ సంఘం నాయకులు రాణి, నాగదేవి, శిరీషా నాయకత్వం వహించారు.

అల్లూరి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

కొయ్యూరు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి ముగింపు ఉత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని కోరుతూ జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్, పీవో అభిషేక్‌లకు లేఖ రాశారు. జూలై నాలుగున అల్లూరి జయంతి నేపథ్యంలో ఆ రోజు ఉత్సవాన్ని కృష్ణాదేవిపేటలో ఘనంగా జరపాలని, మంపలోని అల్లూరి విగ్రహానికి విద్యుద్దీపాలతో అలంకరించాలని కోరారు.

ప్రీప్రైమరీ విద్యతో చిన్నారులకు మంచి భవిష్యత్



డుంబ్రిగుడలోని ర్యాలీలో ఐసీడీఎస్ సీడీపీవో నీలిమ, అంగన్‌వాడీ కార్యకర్తలు



నెల్లిపూడిలో ప్రీ ప్రైమరీ విద్యపై ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు



చింతపల్లిలోని అవగాహన ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది

డుంబ్రిగుడ: ప్రీ ప్రైమరీ విద్యతో చిన్నారులకు మంచి భవిష్యత్ ఉంటుందని ఐసీడీఎస్ సీడీపీవో నీలిమ అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన జన భాగిదారి కార్యక్రమంలో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. డుంబ్రిగుడ ఐసీడీఎస్ కార్యాలయం నుంచి అరకు–పాడేరు ప్రధాన రోడ్డు వరకు అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో నీలిమ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని , చిన్నారులకు ప్రీ ప్రైమరీ విద్య సక్రమంగా అందుతుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐటీడీఏ అందిస్తున్న పీపీ–1, పీపీ–2 వర్క్‌బుక్స్, ఆక్టివిటీ పుస్తకాలు, స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాల ద్వారా పిల్లలకు ఆట పాటలతో విద్యను అందించాలని సూచించారు.

ప్రభుత్వం అందిస్తున్న వాటిని సద్వినియోగం చేసుకునేలా విస్తృతంగా అవగాహన చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిరూరల్: జన భాగీదారి కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ సీడీపీవో రామలక్ష్మి మండల కేంద్రంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందిస్తున్న ప్రీ ప్రైమరీ విద్యతో పాటు జగ భాగీదారి కార్యక్రమంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

గంగవరం : బాలలను బాగా చదవించాలని, బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని గంగవరం ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్.లక్ష్మి అన్నారు. గంగవరం, నెల్లిపూడి గ్రామ సచివాలయాల్లో ప్రీ ప్రైమరీ విద్య, జన భాగీదారి కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగవరం, నెల్లిపూడి గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులతో కలసి అంగన్‌వాడీ విద్యపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నెల్లిపూడిలో ప్రీస్కూల్ పిల్లలకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను సర్పంచ్ పాతర రమణమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు పెబ్బిలి కనకలక్ష్మి అందజేశారు. మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు కె.ఎస్.ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బాబ్జి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సత్యవతి, జయలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్ల పండగలు

కె.కోటపాడు : చిరికివానిపాలెంలో మరిడిమాంబ, ముత్యాలమ్మ అమ్మవారి పండగలను గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులతో ఇద్దరు అమ్మవార్ల ఆలయాలు రద్దీగా మారాయి. పండగ నిర్వహణతో గ్రామమంతా బంధువులు, స్నేహితుల రాకతో సందడిగా మారింది.


నేడు ఐదు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

అడ్డతీగల: రంపచోడవరం 220/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏపీ ట్రాన్స్‌కో ఈఈ ఎండీ యూసఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని మారేడుమిల్లి, గంగవరం, అడ్డతీగల, వై.రామవరం, రాజవొమ్మంగి మండలాల్లోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

వైభవంగా మరిడిమాంబ పండగ

మాడుగుల: సత్యవరంలో మరిడిమాంబ జాతర గురువారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

గ్రంథాలయం అభివృద్ధికి ప్రతిపాదనలు



వివరాలు సేకరిస్తున్న ఎంపీడీవో వెంకటరత్నం

చింతూరు: కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు స్థానిక గ్రంథాలయం అభివృద్ధికి నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపినట్టు ఎంపీడీవో వెంకటరత్నం తెలిపారు. ఆయన గురువారం గ్రంథాలయాన్ని సందర్శించి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి లైబ్రేరియన్ మన్సూర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటరత్నం మాట్లాడుతూ గ్రంథాలయం మరమ్మతులు, పుస్తకాలు, స్టేషనరీ, ఫర్నీచర్, కంప్యూటర్ నిమిత్తం రూ.5 లక్షలతో ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. నిధులు మంజూరు కాగానే గ్రంథాలయం అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు.

పాలపౌడర్ డబ్బాల పంపిణీ



పాలపౌడర్ డబ్బాలను పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, గిరిజన సంఘం నాయకులు

డుంబ్రిగుడ: మండలంలోని అరకు సంతబయలు గ్రామంలో తల్లి లేని చిన్నారికి యూనిటీ ఫర్ చారిటీ ట్రస్టు ప్రతినిధులు పాల పౌడర్ డబ్బాలను గురువారం పంపిణీ చేశారు. ఏడాది వయస్సు ఉన్న చిన్నారి కిల్లో కేళి తల్లి ఇటీవల మృతి చెందింది. పేద కుటుంబానికి చెందిన చిన్నారి పాల కోసం పడుతున్న ఇబ్బందులను స్థానికుల ద్వారా తెలుసుకున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు సాయం చేసేందుకు ముందుకొచ్చారు. ఇందులో భాగంగా వారు గ్రామంలో సందర్శించి చిన్నారి కేళి కుటుంబానికి పాల పౌడర్ డబ్బాలను అందజేశారు. సంస్థ ప్రతినిధులు నీలి నారాయణ, జోఫిన్ మాట్లాడుతూ తమ సంస్థ తరపున గ్రామాల్లో అనాథ, పేద చిన్నారులకు విద్య, వైద్యం ఇతరత్రా సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర మాట్లాడుతూ యూనిటీ ఫర్ చారిటీ ట్రస్టు ఏజెన్సీలో చేస్తున్న సేవలను కొనియాడారు. చిన్నారికి పాల పౌడర్ డబ్బాలను ఆయన అందజేశారు. పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా ప్రభుత్వం



పినపల్లిలో జేవీకే కిట్లను అందజేస్తున్న సర్పంచ్ సీతాలక్ష్మి, ఎంపీటీసీ వెంకటరామిరెడ్డి



చినార్కూరులో జేవీకే కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సున్నం అభిరామ్

కూనవరం: పేద విద్యార్థులకు అండగా ప్రభుత్వం పలు పథకాలను అమలుచేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సున్నం అభిరామ్ అన్నారు. మండల పరిధిలో చినార్కూరు పంచాయతీ తెల్లవారి గుంపు ఎంపీపీఎస్ పాఠశాలలో గురువారం జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారు ఎక్కువ శాతం పేద విద్యార్థులే ఉంటారని, వారి తల్లిదండ్రులకు పిల్లల చదువులు ఆర్థిక భారం కాకూడదన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి, విద్యా కానుక తదితర పథకాలు ప్రవేశపెట్టారన్నారు. జగనన్న విద్యా కానుక ద్వారా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్, షూ, బ్యాగ్స్ తదితర కిట్లు అందజేస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయురాలు యశోద తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: ఎటపాక మండలం గుండాల పినపల్లి ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందచేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు గొంగడి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న విద్యాకానుక కిట్లను అందచేస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. సర్పంచ్ గుండి సీతాలక్ష్మి, హెచ్‌ఎం రాజు, సచివాలయ కన్వీనర్ ఎర్రగోళ్ల నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు



ఎంపీడీవో సీతయ్యకు అభినందనలు తెలియజేస్తున్న ఎంపీపీ రమేష్, జెడ్పీటీసీ నూకరాజు

కొయ్యూరు: మండల కేంద్రంలో గురువారం సచివాలయ కార్యదర్శులు, సంక్షేమ సహాయకులతో ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో లాలం సీతయ్య ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. అన్ని రకాల రికార్డులను విధిగా నిర్వహించాలని సూచించారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను వెంటనే ఇవ్వాలని, ఎలాంటి జాప్యం చేయవద్దన్నారు. ఆధార్ సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీడీవో సీతయ్యను ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, చింతపల్లి ఏఎంసీ చైర్మన్ జె.రాజులమ్మ కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసే విధంగా చూడాలని ఎంపీడీవోను కోరారు. సచివాలయాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. ఈవోపీఆర్‌డీ నాయుడు, జేఈలు రామకృష్ణ, విశ్వతేజ తదితరులు పాల్గొన్నారు.

దిశ యాప్‌తో మరింత భద్రత



అరకులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సంతోష్, చిత్రంలో కళాశాల సిబ్బంది



వై.రామవరం గ్రామ శివారులో దిశ యాప్ రిజిస్ట్రేషన్లు చేస్తున్న పోలీసులు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎస్‌ఐ సంతోష్ విద్యార్థులకు దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణకు ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన దిశ యాప్ వినియోగంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలకు ఈ యాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆపదలో రక్షణ కల్పిస్తోందన్నారు. ఈ యాప్‌ను మహిళలు, యువతులు తప్పనిసరిగా ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్, మహిళ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ పద్మలత, సిబ్బంది విజయలక్ష్మి, ప్రసాద్‌రావు, గురయ్య, రాజు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

వై.రామవరం: జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధ, గురువారాల్లో మండలంలో నిర్వహించిన దిశ యాప్ స్పెషల్ డ్రైవ్‌లో 392 మంది మహిళల మొబైల్స్‌లో యాప్ రిజిస్ట్రేషన్లు చేసినట్టు ఎస్‌ఐ ఎం.సంతోష్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా గురువారం వై.రామవరం గ్రామ శివారులోని ప్రధాన రహదారిలో జోరుగా రిజిస్ట్రేషన్లు చేశారు. యాప్‌ను ఉపయోగించుకునే విధానంపై అవగాహన కల్పించారు.ఎస్‌ఐతో పాటు అడిషనల్ ఎస్‌ఐ కె.రాంబాబు, ఏఎస్‌ఐ సత్యనారాయణ, సిబ్బంది, సచివాలయాల మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి చర్యలు

చింతపల్లి: తాజంగిలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రుక్మాంగరాజు చెప్పారు. గ్రామంలో తాగునీటి సమస్యపై స్థానిక మహిళలు గ్రామ సచివాలయం ఎదుట ఖాళీ బిందెలతో గురు వారం నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ స్పందించి, త్వరలో సమస్య పరిష్కరిస్తామన్నారు.